

ఘనంగా రామయోగి స్వామి తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలో పొట్లపాడు రామయోగిస్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



వీనుల విందుగా వేణుగాన కచేరి

పాత గుంటూరు: త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పలు కచేరీలు అలరించాయి.



దుర్గమ్మకు బంగారు గాజులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపైన కొలువైఉన్న దుర్గమ్మకు తాడేపల్లిగూడెంకు చెందిన భక్తులు సోమవారం బంగారు గాజులను కానుకగా సమర్పించారు.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 30 । జనవరి । 2024

న్యూస్‌రీల్

గుంటూరు జిల్లా ఎస్పీగా తుషార్ డూడీ



నగరంపాలెం: గుంటూరు జిల్లా ఎస్పీగా తుషార్ డూడీ నియమితులయ్యారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న తుషార్ డూడీని గుంటూరుకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్పీగా కొనసాగిన ఆరిఫ్ హఫీజ్‌ను ఐఎస్‌డబ్ల్యూకు బదిలీ చేశారు.

నేటి నుంచి జగనన్న స్థలాల రిజిస్ట్రేషన్లు

గుంటూరు వెస్ట్ : నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను మంగళవారం నుంచి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం వర్చువల్ విధానంలో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.43 లక్షల ఇళ్ల పట్టాలు అందజేశామన్నారు. నిర్దేశించిన సచివాలయం క్లస్టర్లలో పట్టాలున్న అందరికీ రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి హద్దులు, మ్యాపింగ్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. వచ్చే నెల 9 నాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం పూర్తి చేసేందుకు కావాల్సిన సిబ్బంది, కంప్యూటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్లకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది కొంత ఎక్కువ పని చేయాల్సి ఉంటుందని, దీనిని బాధ్యతగా భావించాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలకు నిర్దిష్ట విధానాలు

గుంటూరు వెస్ట్ : ఈ ఏడాది ఖరీఫ్ సహా రానున్న రబీకి పంట రుణాలు అందించేందుకు నిర్దిష్ట విధానాలు అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన టెక్నికల్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ టెక్నికల్ కమిటీ నిర్ణయం మేరకు రుణాలు అందించాలన్నారు.

మార్మోగిన సామాజిక నినాదం

చిలకలూరిపేట సామాజిక జన సంద్రమైంది. పెద్దఎత్తున తరలివచ్చిన జనం సాధికార నినాదాన్ని చాటారు. గత పెత్తందారీ మనస్తత్వం గల పాలకులచే నిరాదరణకు, హేళనలకు, చిన్నచూపునకు గురైన వైనాన్ని.. నేడు తమకు అన్నివిధాలుగా ప్రాధాన్యతనిస్తున్న జగనన్న పాలనలో సగర్వంగా.. ఆత్మగౌరవంగా తలెత్తుకు తిరుగుతున్న వైనాన్ని పోల్చి చూస్తూ.. పదం పదం కలిపి కదం తొక్కారు. జై జగన్.. జైజై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా.. పెత్తందార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా నినదించారు.

- జనసంద్రమైన చిలకలూరిపేట
- సామాజిక సాధికారతను నలుదిశలా చాటిన పార్టీ శ్రేణులు
- మహనీయులకు నివాళులు.. పలు వర్గాల ఆత్మీయ సత్కారాలు
- యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం
- నాయకుల ప్రసంగాలకు జేజేలు

సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన జనం



బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజని, సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట: సామాజిక చైతన్యం నినాదంతో చిలకలూరిపేట మార్మోగింది. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించేందుకు.. సంక్షేమ ఫలాల లబ్ధిని తెలియజేసేందుకు.. సుపరిపాలనకు అండగా నిలిచేందుకు.. రాబోయే ఎన్నికల్లో ప్రజలకు మార్గదర్శనం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు, బహిరంగ సభకు చిలకలూరిపేట ప్రజానీకం పోటెత్తింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సోమవారం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు బస్సు యాత్రకు ఇతర ఉన్నతవర్గాలు సైతం తరలిరావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. అంచనాలకు మించి జనం తరలి రావడంతో యాత్ర విజయవంతమైంది.

భారీగా ర్యాలీ..

బస్సుయాత్ర జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్త వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం నుంచి భారీ ర్యాలీగా కోయ నృత్యాలు, కేరళ సాంప్రదాయ నృత్యాలు, తీన్‌మార్ డోలక్ వాయిద్యాలతో సంబరంగా కొనసాగింది. యాత్రలో వైఎస్సార్ సీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభలో పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళులు...

తొలుత ఎన్ఆర్‌టీ సెంటర్‌కు చేరుకుని అక్కడ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్రేన్ సహాయంతో గజమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి భాస్కర్ సెంటర్‌కు చేరుకుని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు నివాళులర్పించారు. తదుపరి అమరజీవి పొట్టి శ్రీరాములు, డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ విగ్రహాలకు నివాళులర్పించారు. చౌత్రా సెంటర్లో ఆర్యవైశ్యులు, రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ముస్లిం, ఎస్సీ వర్గీయులు యాత్రలో పాల్గొన్న నాయకులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అక్కడినుంచి కళామందిర్ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ వద్దకు నాయకులు చేరుకున్నారు.



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రజని, ఎంపీ విజయసాయి రెడ్డి, మల్లెల రాజేష్‌నాయుడు

అక్కడ సభ వేదిక పై నుంచి మంత్రి విడదల రజిని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కుంభా రవిబాబు ప్రసంగించారు. నాయకుల ప్రసంగాలకు ప్రజలు హర్షధ్వానాలు పలికారు.

జగనన్న సంకల్పం గొప్పది...

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలన్న జగనన్న సంకల్పం గొప్పదని కొనియాడారు. గతంలో ఎవరైతే ముఖ్యమంత్రిగా ఉంటారో ఆ సామాజిక వర్గం వారికి మాత్రమే పరిపాలనలో అధికశాతం వాటా దక్కేదని, అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పరిపాలనలో సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న పాలనలో సొంత ఆస్తి లేని వారంటూ లేరన్నారు. జగనన్న కాలనీల పేరున రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చి ఆస్తిహక్కు కల్పించారని కొనియాడారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ రీజినల్ కో–ఆర్డినేటర్ షేక్ హుస్సేన్, కృష్ణబలిజ, పూసల బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, ఎంపీపీలు పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, నాయకులు పాల్గొన్నారు.

'సాధికార' సైడ్‌లైట్స్...

- సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారి పక్కన ఉన్న చిలకలూరిపేట కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు వద్దకు వైఎస్సార్ సీపీ జాతీయ నాయకులు, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, కుంభా రవిబాబు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడులు మధ్యాహ్నం 3.50 గంటలకు చేరుకున్నారు.
- సాయంత్రం 4 గంటల నుంచి 4.45 వరకు వివిధ వర్గాలకు చెందిన తటస్థులతో సమావేశం నిర్వహించారు.
- సాయంత్రం 4.50 గంటల నుంచి 5.05 వరకు విలేకర్ల సమావేశం నిర్వహించారు
- సాయంత్రం 5.15 గంటల నుంచి బస్సు యాత్ర ప్రారంభమై సాయంత్రం 6.40కు పట్టణంలోని కళామందిర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక వద్దకు చేరుకుంది.
- బహిరంగ సభ సాయంత్రం 6.50 గంటలకు ప్రారంభమై రాత్రి 7.50 గంటల వరకు కొనసాగింది.

నేడు భేటీ కానున్న స్థాయీ సంఘాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాలు మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో భేటీ కానున్నాయి. ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. అదే విధంగా వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులతో పాటు మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సీఈవో జె.మోహనరావు సూచించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

60 కిలోల గంజాయి, 2 కార్లు, రూ.2.28 లక్షలు పట్టివేత

నగరంపాలెం: అక్రమమార్గంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 60 కిలోల గంజాయి, రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.2.28 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని ఎస్ఈబీ–2 స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, ఎస్ఈబీ–2 సీఐ లతలతో కలిసి కేసు వివరాలను సెబ్ జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు సోమవారం పొత్తూరులోని ఓ దంత కళాశాల సమీపాన వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రెండు కార్లలో సోదాలు చేయగా, ఒక కారులో 48 కిలోలు, మరో కారులో 12 కిలోల గంజాయి గుర్తించారు. అందులో బెంగళూరు నగరం హెచ్ఎస్ఆర్ లాయట్ 24 – మెయిన్ మూడో అడ్డరోడ్‌కు చెందిన కిషోర్ పాలక్షరెడ్డిని గుర్తించి, రూ.2.28 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కిషోర్‌తోపాటు బెంగళూరులోని కృష్ణమూర్తి లాయట్ మూడో అడ్డరోడ్ వాసి అభినయ సుద్దగుంట పాళ్య వెంకటేష్, బెంగళూరు బాలాజీనగర్ రెండో అడ్డరోడ్‌కు చెందిన సుమంత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా అరగొండ గ్రామంలో 60 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో కిషోర్, వెంకటేష్, సుమంత్‌కుమార్‌లను అరెస్ట్ చేశామని ఏఎస్పీ తెలిపారు. వారి నుంచి 60 కిలోల గంజాయి, రెండు కార్లు, ఏడు మొబైల్‌ఫోన్లు, రూ.2.28 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు, పక్కన ఏఈఎస్ కృష్ణకిషోర్ రెడ్డి, సెబ్–2 సీఐ లత, ముసుగులో నిందితులు

చిన్ననాటి స్నేహితులు..

ఈ కేసులోని కిషోర్ పాలక్షరెడ్డి బెంగళూరులో కాంట్రాక్ట్ పద్ధతిలో చెత్త పనులు చేసేవాడు. గంజాయికి, మత్తుకి అలవాటైన అతనికి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశ ఉండేది. దీంతో గంజాయి అలవాటు ఉన్న చిన్నానాటి స్నేహితులైన కన్‌స్ట్రక్షన్ పనులు చేసే వెంకటేష్, కార్ల క్రయ/విక్రయాలు జరిపే సుమంత్‌కుమార్‌లు ముఠాగా ఏర్పడ్డారు. గంజాయి తాగే వారితో ఉన్న పరిచయాలతో ఒడిశాలోని కోరాపుట్ జిల్లా అరగొండ గ్రామంలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. కొనుగోలు చేసిన గంజాయి బెంగళూరులో అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. ఈ ముగ్గురు ఉన్నత విద్యను అభ్యసించిన వారే. గత ఏడాది నుంచి అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్నారు. ఏడాదిగా తప్పించుకు తిరుగుతున్న ఈ ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్ చేవారు. వీరు పోలీసులకు దొరకడం ఇదే మొదటిసారి అని ఏఎస్పీ తెలిపారు. పెద్ద మొత్తంలో తరలిస్తున్న గంజాయి గుర్తించి, చాకచాక్యంగా పట్టుకున్న సెబ్–2 స్టేషన్ సీఐ బి.లత, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

స్పందనకు అధికారులంతా హాజరవ్వాలి


జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖలోనూ అధికారులకు స్పందన అర్జీలపై అవగాహన ఉండాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో ఉన్నా, పరిష్కారానికి ఇబ్బందిగా ఉన్నా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కసారి పరిష్కారమైతే మళ్లీ అర్జీదారునికి ఇబ్బంది ఉండకుండా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం వచ్చిన 197 అర్జీలను కలెక్టర్, జేసీ జి.రాజకుమారి, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ లక్ష్మీ కుమారి, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసి రాజకుమారి


గుడి స్థలాన్ని కబ్జా చేసి ఇల్లు కట్టారు..



స్థానికంగా ఉండే టీడీపీ నాయకుని అండతో మా గ్రామంలో దేవాలయం కోసం ఏర్పాటు చేసిన 5 సెంట్ల భూమిని ఓ కుటుంబం కబ్జా చేసి ఇల్లు కట్టుకున్నారు. అడుగుతుంటే మాపై దౌర్జన్యం చేస్తున్నారు. స్థానిక అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సాయం చేయండి.

– కొల్లిపర గ్రామస్తులు

దౌర్జన్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు..



గోరంట్లలోని ఓ స్కూల్లో దౌర్జన్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. 2022లో ఆ స్కూల్ పేరు వేరే ఉండేది. మా బాబుని అక్కడ చేర్పాము. వారడిగిన ఫీజులు చెల్లించాం. ఇటీవల ఆ స్కూల్ పేరును మార్చి ఎక్కువ ఫీజులు అడుగుతున్నారు. పిల్లలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. న్యాయం చేయండి.

– రాములు, గుంటూరు

● తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4200, గరిష్ట ధర రూ.6000 పలికింది.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారు..

'స్పందన'లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ వద్ద బాధితుల గోడు


బాధితుల సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: ఉద్యోగాల పేరుతో ఇద్దరు మోసగించారని బాధితులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన)లో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అర్జీలు స్వీకరించారు. వారి గోడుని ఆలకించారు. నిర్దేశించిన గడువులోగా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. మహిళల ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు అర్జీలు స్వీకరించారు.

టీచర్ పోస్టులు ఇప్పిస్తానని.. రూ.1.93 కోట్లు వసూలు

సుమారు ఐదేళ్లకుపైగా ప్రకాశం జిల్లా పొదిలి వాసితో నాకు పరిచయం ఉంది. సీబీసీఎన్‌సీ సంస్థలో ఎయిడెడ్ టీచర్ పోస్టులు ఇప్పిస్తానని అతను నమ్మించాడు. కృష్ణా జిల్లాలో పలుకుబడి ఉందని, సంస్థ కన్వీనర్ తెలుసునని, ఏడాది లోపు పోస్టులు వస్తాయని చెప్పాడు. అతని మాటలు నమ్మి నా ద్వారా సుమారు 40 మంది రూ.1.93 కోట్లు దఫాల వారీగా అతనికి చెల్లించారు. ఏళ్లు గడిచినా పోస్టులు ఇప్పించలేదు. బాధితులు నా ఇంటికొచ్చి గొడవ చేయడంతో..రూ.20 లక్షలు వరకు కొందరికి చెల్లించాను. అయినప్పటికీ వారి నుంచి ఒత్తిడి తగ్గలేదు. దీంతో సదరు వ్యక్తిని నిలయదీగా.. నియమాక పత్రాలు అందజేశాడు. అవి నకిలీవని తేలింది. తిరిగి డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడు.

– బి.నాగమల్లేశ్వరరావు,
రిటైర్డ్ టీచర్, రత్నపురి కాలనీ, గుంటూరు టౌన్.

జూనియర్ అసిస్టెంట్, హోంగార్డు ఉద్యోగాలిస్తానని..

సుమారు నాలుగేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో ఒకరు పరిచయమయ్యారు. వెలగపూడి సచివాలయంలో మూడు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, పది హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 15 రోజుల్లో ఉద్యోగాలు వస్తాయని చెప్పాడు. దీంతో నా ద్వారా పలువురితో కలిసి అతనికి రూ.8.50 లక్షలు చెల్లించాం .ఏళ్లు గడిచినా ఉద్యోగాల్లేవు. తిరిగి డబ్బులు ఇవ్వాలని అడిగితే బెదిరిస్తున్నాడు. అతనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. బాధితుల్లో ఒకరు.. నామీద.. అలాగే మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దీంతో మోసగించిన వ్యక్తిని వదిలేసి నన్ను అరెస్ట్ చేశారు. బాధితుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది.

– కొండెపాటి రవీంద్రబాబు,
అబ్బినేనిగుంటపాలెం, పెదనందిపాడు.

తొమ్మిదిమంది కనిపించడం లేదు..

కూలి పనుల నిమిత్తం తాడేపల్లి వచ్చి ఉంటున్నాం. ఊళ్లకు వెళ్లి.. బెలూన్లు విక్రయించి జీవనం సాగిస్తున్నాం. ఈ నెల 28న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులో తొమ్మిది మంది మా వాళ్లు వచ్చారు. ఆ తర్వాత నుంచి వారు కనిపించడం లేదు. వారి వద్దనున్న సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దయచేసి వారి ఆచూకీ గుర్తించాలి.

– సుమన్ జైన్ బోస్లే,
మహారాష్ట్ర.

3 నుంచి సాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవం



పెదవడ్లపూడి(మంగళగిరి): దక్షిణ భారత షిర్డీగా ప్రసిద్ధి గాంచిన పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవం ఫిబ్రవరి 3 నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ జెడ్పీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. ఆలయం వద్ద సోమవారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. వార్షికోత్సవానికి ప్రజా ప్రతినిధులను, సినీ ప్రముఖులను ఆహ్వానించడం జరిగిందన్నారు. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే వార్షికోత్సవం రోజున స్వామి వారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ నటులతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిలీప్, ప్రసాద్, జగ్గారపు శ్రీనివాసరావు, అమ్మయ్య, సాంబశివరావు, జొన్నలగడ్డ రాఘవయ్య, రామిరెడ్డి, పాతూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 12 నెలల జైలు శిక్ష

నగరంపాలెం: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి 12 నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు రెండో ఏజేసీజే కోర్ట్ జడ్జి తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ సోమవారం కేసు వివరాలను ఒక ప్రకటనలో తెలిపారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళతో సంపత్ నగర్ వాసి కొండాపాలపర్తి శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. అతనిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాహ్నవి ప్రాసిక్యూషన్ తరుపున వాదించగా, కేసులో దర్యాప్తు అధికారి ఎస్ఐ బాబురావు ప్రస్తుతం సీసీఎస్‌లో ఉన్నారు. ఈ కేసులో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా విచారణ చేపట్టి సాక్ష్యాధారాలతో నిందితుడిపై నేర నిరూపణ కావడంతో శిక్ష విధించారు.

నగరపాలక సంస్థ స్టాల్‌కు మొదటి స్థానం


కమిషనర్‌కు మెమెంటో అందజేస్తున్న డెప్యూటీ కమిషనర్, ఎంహెచ్‌ఓ

నెహ్రూనగర్: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో గుంటూరు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన 'సమర్థవంతంగా వ్యర్థాల నిర్వహణ' స్టాల్‌కి మొదటి స్థానం దక్కిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి.. శంకరన్ హాల్లో అవార్డును ప్రకటించి, మెమెంటోని అందజేశారు.

ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్ కమిషనర్‌ను ఆమె చాంబర్‌లో కలిసి మెమెంటోను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాల్లో జిల్లా స్థాయిలో నగరపాలక సంస్థ స్టాల్‌కి మొదటి స్థానం దక్కడం ఆనందంగా ఉందన్నారు. స్టాల్‌లో గుంటూరు నగరంలో ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల ద్వారా క్లస్టర్, విండ్రో, వర్మి కంపోస్ట్ ద్వారా ఎరువు తయారీ, పొడి చెత్త రీ-సైక్లింగ్, మిగిలిన చెత్తను జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కి తరలించడం వంటి అంశాలను ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వ్యర్థాల నిర్వహణ సాంకేతిక విధానం ద్వారా సమర్థవంతంగా చేస్తున్న తీరును ఎల్ఈడీ ప్రదర్శనతో వివరించడంతో మొదటి స్థానం లభించిందన్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంక్ నగరపాలక సంస్థకు వచ్చిందని, జిల్లా స్థాయిలో అందిన తొలి స్థానం స్ఫూర్తితో రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని మరింత స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి కృషి చేస్తామన్నారు.

వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు ప్రారంభం


గోవింద నామ జప యజ్ఞంలో ఏర్పాటు చేసిన స్వామివారు


సప్తాహలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గోవింద నామ జపయజ్ఞం పూర్ణాహుతి

తెనాలిటౌన్: పట్టణంలోని తాలూకా హై స్కూల్ గ్రౌండ్‌లో శ్రీవిద్యా పీఠం, శ్రీ సాలీ గ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గోవింద నామ జపయజ్ఞం పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో గణపతి సచ్చిదానంద స్వామిజీ శిష్య బృందం నిర్వహించింది. బాల స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సుప్రభాత సేవ జరిపారు. సచ్చిదానంద స్వామి శిష్య బృందం సంపూర్ణ భగవద్గీత సహస్ర పారాయణం, లక్ష తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల స్వామిజీ మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఏ విధంగా జరుగుతుందో.. అదే విధంగా తెనాలిలో జరుగుతున్న వైభోత్సవంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం శృంగేరి శారద పీఠం ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి ప్రవచనం ఉంటుందన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని వెల్లడించారు. వైభోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గోవింద నామార్చనతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణ మూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, కోన నాగేశ్వరరావు, రామకృష్ణ, చక్రవర్తి, సీతారామిరెడ్డి, కన్యాకుమారి, అరుణకుమారి, సాలీగ్రామ మఠం, శ్రీ విద్యాపీఠం, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం


భారీ భక్త జన సందోహం మధ్య రథోత్సవం


కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న చిన జీయర్ స్వామి


రథమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రసన్నాంజనేయస్వామివారి రథోత్సవం సోమవారం అంగరంగ వైభవపేతంగా జరిగింది. 17వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను, రథాన్ని పట్టణంలోని మెయిన్ బజారులో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. అంతేకాకుండా పంచముఖ ప్రసన్నాంజనేయ స్వామివారికి కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం వద్ద సీతారాముల వారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రస్థాపకులు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణల్లో సుమారు 70 వేల మందికి పైగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రథమహోత్సవం....

స్వామివారి రథమహోత్సవం, కల్యాణ మహోత్సవంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, పూజారులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసి స్వామివారి రథాన్ని లాగి రథమహోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. పిడుగురాళ్ల పట్టణ సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

మిర్చి యార్డులో రైతు ఉచిత ఫలహార, భోజన పథకం ప్రారంభం

ప్రారంభించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


రైతులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతు ఉచిత ఫలహారం, భోజన పథకాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైతుల కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, లేళ్ల అప్పిరెడ్డి యార్డు చైర్మన్‌గా ఉన్న సమయంలో వచ్చిన ప్రతి రైతుకు ఉచిత భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నారని, అప్పటి నుంచి ప్రతి ఏడాది సంప్రదాయ పద్ధతిలో ఉచిత భోజనం కొనసాగిస్తూ వస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత భోజనం మాత్రమే కాదని, అల్పాహారం కూడా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన రుచికరమైన అల్పాహారం, భోజనం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనంతోపాటు కోడి గుడ్డు కూడా రైతులకు అందిస్తామని తెలిపారు. మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్‌శాఖ రీజినల్ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ యార్డు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది, ఎగుమతి, దిగుమతి వ్యాపారుల సమన్వయంతో దేశంలోనే గుంటూరు మార్కెట్ యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును యార్డు పాలకవర్గం, అధికారులు సత్కరించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ మరో జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, ఏడీఎం బి.రాజబాబు, యార్డు డైరెక్టర్లు బందలపాటి వెంకటేశ్వరరావు, ఇంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరెడ్డి, యార్డు అధికారులు శివారెడ్డి, సుబ్రమణ్యం, శ్రీకాంత్, మిర్చి దిగుమతి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, ఎగుమతి వ్యాపారుల సంఘం నాయకులు సాంబశివరావు, కె.సుధాకర్, రామకృష్ణ, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున మిర్చి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఖోఖో జాతీయ క్రీడాకారుడు మృతి


వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఖోఖో క్రీడాకారులు

జే.పంగులూరు: మండలంలోని కొండమూరుకు చెందిన ఖోఖో జాతీయ క్రీడాకారుడు వెంకటరెడ్డి (46) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఇరవై సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించారు. అనారోగ్యంతో గతంలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ఖోఖో, ఇండియన్ ఖోఖో అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. పంగులూరులోని జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆయన శిక్షణ పొందిన ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమి క్రీడాకారులు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

మరనాత.. హల్లెలూయా!

● ముగిసిన బైబిల్‌మిషన్ మహోత్సవాలు
● వాక్యపరిచర్య చేసిన బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెవ.జె.శామ్యూల్ కిరణ్


బైబిల్‌మిషన్ మహోత్సవాల ముగింపుసభలో వాక్యోపదేశం చేస్తున్న కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్‌కిరణ్

పెదకాకాని: లోకరక్షకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని నమ్మకమైన విశ్వాసపూరితమైన ప్రార్థనలు జరిపించాలని బైబిల్‌మిషన్ మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. దైవజనులు ఫాదర్ ఎం.దేవదాసు అయ్యగారికి బయలుపరచిన 86వ బైబిల్‌మిషన్ మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు నాలుగురోజుల పాటు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట వేయబడిన పందిళ్లలో మహిమకరంగా మహోత్సవములు కొనసాగాయి. ఈ సందర్భంగా బైబిల్‌మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ వాక్యోపదేశం చేస్తూ విశ్వాసం మీద ఆధారపడి ఉన్న మిషనే బైబిల్‌మిషన్ అన్నారు. దేవుని కృపతో బైబిల్‌మిషన్ మహోత్సవాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారి తరువాత ఈ ఏడాది లక్షలాది మంది భక్తులతో మహోత్సవాలు జయకరంగా జరిగాయన్నారు. మహోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి లక్షలసంఖ్యలో విశ్వాసులు వచ్చారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పి.జాన్‌దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, పి.ఆగమనరావు, ఎం.రవిల ఆశీర్వాద ప్రార్థనలతో బైబిల్ మిషన్ మహోత్సవాలు ముగిశాయి. తొలుత రెవరెండ్లు ఎం.స్టీఫెన్‌రాజు, బి.ఏలియా, జి.నెహెమ్యా దేవదాసు, జె.ఆగమనరావు, ఎం.రవిలు దైవ సందేశాలు అందించారు. కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ గీతాలను ఆలపించారు.